# ఆటవిడుపు

ఆఫీసు హాలు బోసిపోయినట్లుంది. సీట్లలో ఎవ్వరూ కనిపించడం లేదు. కొంపతీసి సిబ్బందంతా గైర్హాజరయ్యేరనుకుంటే పొరపాటే. కొందరు వరండాల్లో తచ్చాడుతూ ఉంటే, మరికొందరు కార్యాలయ ఆవరణలో గుంపులుగుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. ఒక రకంగా వాళ్ళకారోజు ఆటవిడుపనే చెప్పాలి.

స్టాఫ్ సెక్రటరీ సత్యదేవ్ తలొకరికి తలోపని పురమాయిస్తున్నాడు. ఒకరు పూలమాలలు, బొకేలు తేవడానికి వెళ్తే, మరొకరు చీఫ్‌గెస్ట్‌ని పిలుచుకొచ్చేందుకెళ్లారు. కొంతమంది అల్పాహార విందు ఏర్పాట్లలో మునిగి ఉండగా మరికొంతమంది స్టేజ్ డెకరేషన్లో నిమగ్నమయ్యారు. సందర్భం ఏమిటంటే ఆవేళ బాస్ యమధర్మరాజు పదవీ విరమణ చేయబోతున్నారు.

బాస్ అసలు పేరు మంగిపూడి ధర్మరాజు. అతడు ఆ ఆఫీసులో అడుగుపెట్టిన కొత్తలో అంతా అతడిని ఎమ్. ధర్మరాజు అనే వారు. కాలక్రమేణా ఆ పేరు యమధర్మరాజుగా రూపాంతరం చెందింది. చివరికదే సార్థకమై పోయింది. అతడి పేరు అలా మారిపోవడానికి కారణం స్టాఫ్ పాలిట ఆయన కాలయముడు కావడమే.

యమధర్మరాజు యమా స్ట్రిక్ట్ ఆఫీసరు.

వర్క్‌లో ఏమాత్రం తేడా కనిపించినా సంబంధిత ఉద్యోగికి మెమోలు జారీ చేస్తాడు. ఆఫీసుకు లేటయితే ఆ రోజు అతడికి సి. ఎల్.కట్ అవుతుంది. సీట్లో కనబడకపోతే గైర్హాజరు కింద లెక్క. అందుకు ఛార్జి మెమో జారీ అవుతుంది. సెలవు కావాలంటే ముందుగా శాంక్షన్ చేయించుకోవాలి. వర్క్ చేసేటప్పుడు పిచ్చాపాటి

మాట్లాడకూడదు. ఏ ఫైలు పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదు. అవసరమైతే ఇంటికి తీసుకెళ్ళి పూర్తి చేయవలసిందే అంతా మిలిటరీ డిసిప్లిన్.

యమధర్మరాజుకి ట్రాన్స్‌ఫర్ అవ్వాలని ఆ ఆఫీసులో దేవుడికి మొక్కనివాడు లేడు. అతడి హయాంలో కంపెనీ ప్రాఫిట్స్ రెట్టింపు కావడంతో ఉన్నతాధికారులెవ్వరూ అతని జోలికి పోలేదు. అతడా బ్రాంచి కొచ్చిన పన్నెండేళ్లలో ఈ పూటే సిబ్బంది కాస్త ఊపిరిపీల్చుకుంటున్నారు జరగబోయేది బాస్ సన్మానం కాబట్టే ఆ రోజు వాళ్ళకు కాస్త రిలీఫ్ దొరికింది.

తమ ఆఫీసరు రిటైరయిపోతున్నారన్న శుభవార్త విన్న స్టాఫ్ ఆనందంతో గుళ్ళల్లో కొబ్బరికాయలు కొట్టారు.

"ఉన్నన్నాళ్లూ మనల్ని కాల్చుకుతిన్నాడు సిగ్గు లేకుండా అటువంటివాడికింకా సన్మానం చేస్తామంటున్నారు. మేం ఎవ్వరం పైసా ఇవ్వం'' అన్నారు స్టాఫంతా ముక్తకంఠంతో.

"బాస్ ఎలానూ పదవీ విరమణ చేసి వెళిపోతున్నాడు కాబట్టి ఇహ మనందరికీ మంచి రోజులు వచ్చినట్లే. అందుకు నాకూ సంతోషంగానే ఉంది. అయితే రిటైరయ్యేవాడిని సన్మానించడం ఫార్మాలిటీ. దానిని ఉల్లంఘించడం వల్ల నష్టపోయేది మనమే. వచ్చే వాడికి ఛార్జి అప్పజెప్పేట ప్పుడు బాస్ మనందరిమీద మంచిగా రిపోర్టు రాయాలంటే మనం ఆ మాత్రం కాకా పట్టక తప్పదు. మన సంతోషాన్ని సన్మాన రూపంలో బహిరగతం చేద్దాం. అందుక అభ్యంతరం ఏమిటి?'' అంటూ నచ్చజెప్పే ధోరణిలో పలి కాడు సత్యదేవ్.

సరేనన్నారు స్టాఫ్ అయిష్టంగా.

విందు అనంతరం సభా కార్యక్రమంమొదలయింది. ముఖ్య అతిథి ప్రసంగం పూర్తికాగానే స్టాఫ్ ఒక్కొక్కరూ వచ్చి బాస్‌ని ఇంద్రుడు చంద్రుడు అంటూ తెగపొగిడేశారు. ఆయిన పదవీ విరమణ చేసి వెళ్లిపోతున్నందుకు ఎంతో మనస్తాపం చెందు తున్నట్లు ప్రకటించారు.

"ఇప్పుడు మన బాస్‌గారికి సన్మానం''స్టేజిమీద కొచ్చిమైక్‌లో అనౌన్స్ చేశాడు సత్యదేవ్.

చప్పట్లు మారుమ్రోగాయ్.

''ఆగండి'' అంటూ సీట్లోంచి లేచాడు యమధర్మరాజు.

విషయం ఏమిటో తెలీక విస్తుపోయి చూస్తున్నారంతా.

"మీ అందరి ఆదరాభిమానాలకి కృతజ్ఞుడ్ని. మీ ప్రసంగాలు వింటూ ఉంటే నా ఒళ్లు పులకరిస్తోంది. మీ అభిమానానికి, ఆప్యాయతకినాజోహార్లు. మీ వంటి వినయ విధేయతలు గలస్టాఫ్ అందర్నీ విడిచిపెట్టి వెళ్ళి పోతున్నందుకు నాకు ఎంతో బాధగా ఉంది. నా మనోవ్యధను ఆ భగవంతుడు ఆలకించాడేమో ఇప్పుడే ఓ శుభవార్త అందింది'' అంటూ ఆగాడు యమధర్మరాజు.

విషయం ఏమిటా అని చెవులు రిక్కించి అంతా ఆదుర్దాగా చూస్తున్నా రు.

''నా సేవలను గుర్తించి కంపెనీ వారు నా పదవీ కాలాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తున్నట్లు ఇప్పుడే ఫాక్స్ మెసేజ్ అందింది'' అంటూ మెసెంజరు పట్టుకొచ్చిన కాగితాన్ని విప్పి చదివాడు యమధర్మరాజు.

ఆ మాటతో ''హా! హతవిధీ. . .'' అంటూ ఒక్కసారిగా మూర్ఛిల్లారంతా.

ఇంకా అతడేదో మాట్లాడుతున్నాడు. అవేవీ వారికి వినిపించడం లేదు.

**(23-10-2003 ఆంధ్రభూమి వీక్లీ)**